# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-10-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **జ్ఞాన సముపార్జనకు పరిమితి లేదని మహర్షి వాల్మీకి నిరూపించారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కొనియాడారు.**

2. **ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు.**

3. **విజయనగరం పైడితల్లి అమ్మవారి ఉత్సవాలలో భాగంగా ఈరోజు మధ్యాహ్నం సిరిమానోత్సవాన్ని నిర్వహించనున్నారు.**

4. **శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు.**

==========================

మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు  గుంటూరు జిల్లా ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో వాల్మీకి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. జ్ఞాన సముపార్జనకు పరిమితి లేదని నిరూపించిన కవి వాల్మీకి అని కొనియాడారు. వాల్మీకి జయంతిని రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు. అనంతపురంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయమని పేర్కొన్నారు.

తిరుపతి, చిత్తూరు, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్లు అధికారులు పాల్గొని వాల్మీకి మహర్షికి నివాళులర్పించారు.

ప్రకాశం జిల్లా ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..

..వాయిస్..30 సెకన్లు

--------------------------

ప్రతి ఒక్కరూ  రక్తదానం చేయడానికి ముందుకు రావాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై.సత్యకుమార్ యాదవ్ తెలిపారు. విశాఖపట్నంలో  జరిగిన  “రేషనల్ యూజ్ ఆఫ్ బ్లడ్ అండ్ బ్లడ్ ప్రొడక్ట్స్” జాతీయ  స్థాయి

కార్యశాలలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా "గివ్ బ్లడ్- గివ్ లైఫ్" పుస్తకాన్ని ఆవిష్కరించడంతో పాటు రక్తదానంలో విశేష సేవలు అందించిన వైద్యులను, సేవకులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రతి మనిషికి రక్తం ప్రాణాధారమన్నారు. రక్తదానం ఒక పవిత్ర సేవ అని రక్తదానం చేయడం ద్వారా ప్రాణాలను రక్షించవచ్చని మంత్రి తెలుపుతూ..

..వాయిస్.. 25 సెకన్లు

---------------------------

విజయనగరంలో పైడితల్లి అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా ఈ మధ్యాహ్నం 3 గంటలకు సిరిమానోత్సవం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. ఉదయం నుంచే క్యూలైన్లలో బారులు తీరారు. ఆలయ అనువంశిక ధర్మకర్త, గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతిరాజు తన కుటుంబసభ్యులతో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అమ్మవారిని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దర్శించుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

వస్తు సేవల పన్ను- జీఎస్టీ 2.0 మార్పులతో ప్రజలకు అవసరమైన వస్తువుల ధరలు గణనీయంగా తగ్గాయని నరసరావుపేట శాసనసభ్యులు సి.అరవింద బాబు తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పలు వాహన దుకాణాల్లో నిన్న 'సూపర్ జీఎస్టీ –సూపర్ సేవింగ్స్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ, 350 క్యూబిక్ కెపాసిటీ –సిసి కంటే తక్కువ సామర్థ్యం ఉన్న ద్విచక్ర వాహనాలపై జీఎస్టీ 28 శాతం నుంచి 18కి తగ్గడంతో బైకులు, స్కూటర్లు కొనుగోలు చేసే ప్రజలకు 5 వేల నుంచి 21 వేల రూపాయల వరకు ఆదా అవుతుందని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఇద్దరు యువకులు జాతీయ సేవా పథకం –ఎన్ఎస్ఎస్ పురస్కారాలను అందుకున్నారు. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో నెల్లూరు విక్రమ్ సింహపురి విశ్వవిద్యాలయానికి చెందిన ఎన్ఎస్ఎస్ వాలంటీర్ ఎం.పృథ్వీరాజ్, నెల్లూరులోని స్థానిక డెంటల్ కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్ డి.జిష్ణురెడ్డి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా 2022–23 సంవత్సరానికి 'మై భారత్–జాతీయ సేవా పథకం' అవార్డులు అందుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేసే వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో క్రియాశీలకంగా పాల్గొనడంతోపాటు, విభిన్న సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టినందుకు గానూ ఈ అవార్డులను అందుకున్నారు.

---------------------------

శ్రీశైల క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో దేవాదాయ, అటవీశాఖల

అధికారులతో మంత్రి నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శ్రీశైలం అభివృద్ధికి రెండు వేల హెక్టార్ల అటవీ భూమిని దేవాదాయశాఖకు కేటాయించేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరేందుకు నివేదిక రూపొందించాలని సూచించారు. భక్తుల రద్దీకి తగినట్లుగా వసతులు, పార్కింగ్ ప్రదేశాలు, అటవీ మార్గంలో కాలినడకన వచ్చే వారి కోసం బేస్ క్యాంప్‌ల ఏర్పాటు వంటి వివరాలన్నీ నివేదికలో స్పష్టంగా పొందుపరచాలని మంత్రి పేర్కొన్నారు.

-----------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి ఈరోజు దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, తిరుమలపై ఇటీవల కొందరు కావాలనే దుష్ప్రచారాలు చేస్తున్నారని, ఆలయ ఆచార వ్యవహారాలపై అవాస్తవాలు ప్రచారం చేయడం సరికాదని అన్నారు.

-----------------------------

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆ పార్టీ నాయకులతో ఈ రోజు సమావేశమైయ్యారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్రకార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు, పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకులు హాజరయ్యారు. రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు, పార్టీబలోపేతం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించిన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అంతకుముందు మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి జగన్మోహన్‌రెడ్డి నివాళులు అర్పించారు.

-----------------------------

గుంటూరు జిల్లా తురకపాలెంలో మళ్లీ జ్వర బాధితులు పెరగడంతో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా ఈరోజు ఆ గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు, గ్రామస్థులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామంలో అనారోగ్య పరిస్థితులను అరికట్టడానికి, జ్వరాలను నియంత్రించేందుకు ప్రజలు భాగస్వాములు అవ్వాలని కోరారు. గ్రామస్థుల ఆరోగ్య పరిస్థితులపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించాలని అధికారులను ఆదేశించారు.

-----------------------------

అవినీతి రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకాశం జిల్లా ప్రాంత మేనేజర్ రవికుమార్ అన్నారు. విజిలెన్స్ వారోత్సవాలలో భాగంగా ఈరోజు ఒంగోలులోని యూనియన్ బ్యాంక్ కార్యాలయం నుంచి నెల్లూరు బస్టాండ్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ రవికుమార్ మాట్లాడుతూ, అవినీతికి వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ నెల 31 వరకు కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు.

-----------------------------

నైరుతి బంగాళాఖాతం, దక్షిణ తమిళనాడు తీర ప్రాంతాల్లో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో రానున్న మూడు రోజులపాటు తేలికపాటి

నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకావముందని వాతారవరణ శాఖ అధికారి ఎమ్.వెంకట్రావు తెలియజేస్తూ,

..వాయిస్.. 23 సెకన్లు

---------------------------

వస్తుసేవల పన్ను– జీఎస్టీ సంస్కరణలపై అన్ని వర్గాల వారికి అవగాహన కల్పించేలా "సూపర్ జీఎస్టీ..సూపర్ సేవింగ్స్" కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. ఏలూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంపై సంబంధిత శాఖల అధికారులతో నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని సచివాలయాలు పరిధిలో జీఎస్టీ పై అవగాహనా కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించాలన్నారు.

======================